# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చడంలో మహిళల భాగస్వామ్యం కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- రోజ్‌గార్ మేళా సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 51 వేల మందికి పైగా అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఈరోజు అందజేశారు.
- ఐక్యరాజ్యసమితికి భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- భావితరం GST సంస్కరణలు పన్ను వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

==============================

కేరళ పర్యటనలో ఉన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎర్నాకుళంలోని సెయింట్ థెరిసా కళాశాల శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించి, శతాబ్ది లోగోను ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చడానికి మహిళల భాగస్వామ్యం ఆవశ్యకమని అన్నారు. మహిళా నాయకుల నేతృత్వంలోని సమాజం మరింత మానవీయంగాను, ప్రభావవంతంగాను ఉంటుందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా మహిళలకు విద్య, సాధికారత కల్పించడంలో సెయింట్ థెరిసా కళాశాల చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. దేశ నిర్మాణంలోను, సామాజిక ఆర్థిక సంస్కరణలలో ప్రతిభకు ఉదాహరణగా నిలిచిన కేరళ మహిళలను రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

(వాయిస్ బైట్...30 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 17వ జాతీయ రోజ్‌గార్ మేళా సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో 51 వేలకు పైగా ఉద్యోగ నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. ఉపాధి మేళాలు దేశ యువత కలలను నెరవేర్చే మాధ్యమంగా మారాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఉపాధి మేళాల ద్వారా ఇప్పటివరకు 11 లక్షలకు పైగా యువతకు నియామక పత్రాలను అందజేశామని పేర్కొన్నారు. స్కిల్ ఇండియా మిషన్ వంటి కార్యక్రమాలు యువతకు నైపుణ్య శిక్షణను అందిస్తాయని, నేషనల్ కెరీర్ సర్వీస్ ప్లాట్‌ఫామ్ వంటివి వారికి నూతన అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. యువతను తమ ప్రభుత్వం దేశానికి ఉన్న గొప్పశక్తిగా పరిగణిస్తుందని, యువతను దృష్టిలో ఉంచుకుని భారత విదేశాంగ విధానాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. భారతదేశ దౌత్య చర్చలు, ప్రపంచ అవగాహన ఒప్పందాలలో యువత శిక్షణ, నైపుణ్యాల పెంపుదల, ఉపాధి కల్పనకు సంబంధించిన నిబంధనలు కూడా ఉన్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 3.5 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా రూపొందిన వికసిత్ భారత్ యోజన ను కూడా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఆర్మీ కమాండర్ల సమావేశం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఈరోజు జరిగింది. భద్రతా పరిస్థితిని అంచనా వేయడం, కార్యాచరణ ప్రాధాన్యతలపై చర్చించడంతో పాటు కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకోవడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం. సమావేశంలో భాగంగా రక్షణ మంత్రి.. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) జనరల్ అనిల్ చౌహాన్ తో కలిసి ప్రస్తుత భద్రతా పరిస్థితిని సమీక్షించారు. అలాగే.. భారత సైన్యం కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడానికి సంబంధించిన చర్యలపై చర్చించారు. సైనికులు, వారి కుటుంబాలకు మద్దతుగా రక్షణ మంత్రి.. నమన్ కేంద్రం, సైనిక్ యాత్రి మిత్ర యాప్, ఉపకరణ్ హెల్ప్ లైన్ యాప్ లను ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కీలకమైన గాజా ఒప్పందాన్ని సాధించడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్ర ప్రశంసనీయమని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీష్ అన్నారు. పశ్చిమాసియాపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. ఈ ఒప్పందాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన అమెరికాకు, ప్రత్యేకించి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు భారత్ తరపున ప్రశంసలు తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఈజిప్టులోని షర్మ్ ఎల్-షేక్‌లో జరిగిన గాజా శాంతి సదస్సులో భారత్ తరపున విదేశాంగ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పాల్గొని, ఈ ఒప్పందంపై సంతకం చేయడాన్ని స్వాగతించారని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భావితరం GST సంస్కరణలు పన్ను వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఘజియాబాద్‌లో కొత్త CGST భవన్‌ను ఈరోజు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. సమర్థవంతమైన పన్ను విధానం ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. నిజాయితీగా పన్నులు చెల్లించేవారి జీవితాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. GST రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళీకృతం, సులభతరం మరింత పారదర్శకంగా చేయడానికి అవసరమైన చర్యలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. వచ్చే నెల 1 నుండి సరళీకృత GST రిజిస్ట్రేషన్ పథకం అమల్లోకి వస్తుందని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో ఈ ఉదయం హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో 19 మంది ప్రయాణికులతో పాటు ద్విచక్ర వాహనదారుడు మృతి చెందగా, పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. గాయపడిన వారికి సమీప ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బస్సు.. మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి ఇంధన ట్యాంక్ పేలిపోయిందని అధికారులు తెలిపారు. కాగా.. ఈ దుర్ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (PMNRF) నుండి మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రధానమంత్రి ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితికి, బహుపాక్షికతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి ఏర్పడి 80 సంవత్సరాలైన సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన స్మారక తపాలా బిళ్ళ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శాంతి, భద్రతతో పాటు అభివృద్ధి, పురోగతికి భారత్ కట్టుబడి ఉంటుందని అన్నారు. అయితే ఐక్యరాజ్యసమితి పనితీరు అంత బాగా లేదని, ప్రపంచ ప్రాధాన్యతలను సరిగా అనుసరించడంలేదని అన్నారు. ఉగ్రవాదంపై ఐక్యరాజ్యసమితి ప్రతిస్పందన.. సమితి ఎదుర్కొంటున్న సవాళ్లకు ఒక స్పష్టమైన ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడికి బాధ్యత వహిస్తున్నామని చెప్పుకునే సంస్థను ఒక భద్రతా మండలి సభ్యుడు బహిరంగంగా సమర్థించడం బహుపాక్షికత విశ్వసనీయతపై సందేహాన్ని లేవనెత్తుతుందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈ నెల 27వ తేదీ నాటికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది మరింత బలపడి తుపానుగా మారవచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో ఈ నెల 28వ తేదీ వరకు తమిళనాడు, కేరళ, మాహేలోను ఈ నెల 29 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లోను భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం తన వాణిజ్య భాగస్వామ్యాలను దీర్ఘకాలిక, పరస్పర వృద్ధి దృక్పథంతో చూస్తుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు. జర్మనీలోని బెర్లిన్‌లో జరిగిన బెర్లిన్ గ్లోబల్ డైలాగ్ మూడవ సంచికలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ప్రపంచ సంస్థలకు భారత్‌లో విస్తారమైన అవకాశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమం వేదికగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. బెర్లిన్‌లో జరిగిన బిజినెస్ లీడర్స్ రౌండ్‌టేబుల్‌లో కూడా కేంద్ర మంత్రి.. జర్మన్ CEOలతో సమావేశమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =